క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

కోటపల్లి: పర్యావరణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. పార్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భారత పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ, తెలంగాణ నేషనల్ గ్రీన్‌కోర్ సంయుక్తంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం అనే లఘునాటికను ప్రదర్శించారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందని, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, హెచ్‌ఎం యోగేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సంతోశ్, సర్పంచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఒడ్డె ఓబన్న జయంతి

మంచిర్యాలటౌన్: ఈ నెల 11వ తేదీన ఉదయం 10:30గంటలకు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఒడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసేందుకు అందరూ హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ అండ్ కాలేజీ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. 6 నుంచి 10తరగతుల వరకు స్వీకరించే దరఖాస్తుల్లో 6వ తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 12నుంచి ఫిబ్రవరి 22వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశాలకు ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు.

అయ్యప్ప ఇరుముడి

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి వేదాంతం సురేశ్ ఆధ్వర్యంలో మాలధారణ చేసిన స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం అయ్యప్ప స్వాములు శబరిమలై తరలివెళ్లారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వేమనపల్లి: బోగి, సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొమ్మిది మంది కోడి పందెం రాయుళ్లను బైండోవర్ చేశారు. కోడి పందేలు, జూదం వంటి వ్యసనాలు జీవితంపై ప్రభావం చూపుతాయన్నారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

బస్సు సౌకర్యం పునరుద్ధరించండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓయూ జేఏసీ నాయకులు

వేమనపల్లి: బెల్లంపల్లి నుంచి బుయ్యారం, జిల్లెడ మీదుగా వేమనపల్లి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్, హైకోర్టు న్యాయవాది గణేష్ మంచిర్యాల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి, బుయ్యారం మీదుగా వేమనపల్లికి 20 రోజులుగా బస్సులు నడపడం లేదన్నారు. అదే విధంగా నెన్నెల మండలం కుశ్నపల్లి వరకు నడుస్తున్న బస్సులను చామనపల్లి వరకు పొడగించాలని కోరారు.

ఎస్‌ఎల్‌పీ ఆర్డర్స్ అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఉద్యోగులకు బుధవారం ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లపై ఆయా అధికారులు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్(ఎస్‌ఎల్‌పీ) ఆర్డర్స్ అందజేశారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని జీఎం చాంబర్‌లో జీఎం మనోహర్ అధికారులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గనుల అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శం.. అస్తవ్యస్తం

- ప్రిన్సిపాల్, సిబ్బంది మధ్య సమన్వయం లోపం?
- తెరపైకి అటెండెన్స్ రిజిస్టర్‌లో ఇంకు వివాదం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇదీ లింగాపూర్ ఆదర్శపాఠశాల దుస్థితి



అటెండెన్స్ రిజిస్టర్‌లో పడిన ఇంకు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల పేరుకే ఆదర్శం తప్పా, అంతా అస్తవ్యస్తంగా తయారయ్యింది. పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మధ్య సమన్వయం లోపించడంతో, కొంత కాలంగా పాఠశాలలో చిన్నచిన్న వివాదాలు తలెత్తుతున్నట్లు సమాచారం. ఈ కారణాలు పాఠశాల విద్యార్థుల సంఖ్య తగ్గుదలపై ప్రభావాన్ని చూపుతున్నట్లు తెలిసింది. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సుమారుగా 750మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 500కు పడిపోయింది. ప్రిన్సిపాల్, సిబ్బంది మధ్య కొరవడిన సమన్వయ లోపం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుదలకు కారణంగా కొందరు చెప్పుకుంటున్నారు.

పాఠశాలలో అసలు ఏం జరుగుతుంది..

లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఏం జరుగుతుందో ఏమో.. ఎవరికి అర్థం కావడం లేదు. పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మధ్య కొంత కాలంగా చిన్న చిన్న వివాదాలు తలెత్తడం, మళ్లీ సర్దుకోవడం ఇక్కడ పరిపాటిగా సాగుతున్నాయి. అయినా ఈ విషయంలో ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా సద్దుమనగడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కూడా ప్రిన్సిపాల్, సిబ్బందికి మధ్య చిన్న చిన్న విబేధాలు తలెత్తడం, ఈ విషయంలో ప్రిన్సిపాల్ కొంతమంది సిబ్బందిని ఇబ్బంది పెట్టిందనే ఆరోపణలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

తెరపైకి అటెండెన్స్ రిజిస్టర్‌లో ఇంకు వివాదం..

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లో ఇంకుపడిన ఘటనతో పాఠశాలలో తలెత్తుతున్న విబేధాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లో ప్రిన్సిపాల్ వేసుకున్న లీవ్‌లను దిద్దుబాటు చేయడం, దీనిని కొంతమంది సిబ్బంది తప్పుబట్టడం మరింత వివాదస్పదంగా మారింది. ఎవరైనా తనిఖీకి వస్తే ఎట్లా ఉంటుందని ప్రశ్నించిన సిబ్బందితో, కొత్త రిజస్టర్ రాద్దామని చెప్పిన ప్రిన్సిపాల్. ఆమె మాటలను, కొందరు సిబ్బంది ఖండించారు. వెంటనే ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం చర్చనీయంగా మారింది. ఇంకు ఎలా పడిందనే విషయాన్ని తెలుసుకునేందుకు పాఠశాలలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తే, అవి పనిచేయక పోవడంపై మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. హాజరు రిజిస్టర్‌లో ఇంకుపడిన విషయం గత డిసెంబర్ నెలలోనే విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ విచారణ చేపట్టకపోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. అధికారులు స్పందించి విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

లింగాపూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లో ఇంకుపడ్డ విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై సిబ్బందిని మందలించాను. విషయం గురించి తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లాను. ఆ సమయంలో ప్రిన్సిపాల్ లేరు. పైగా అక్కడున్న సీసీ ఫుటేజీలు పరిశీలిద్దామంటే, అవి పనిచేయలేదు. విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాను.

- రవీందర్, ఎంఈవో, దండేపల్లి

ఎలా జరిగిందో తెలియదు..

మా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లో ఇంకు ఎలా పడిందో నాకు తెలియదు. విషయాన్ని నేను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్దామనుకునే లోపే, మా సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. హాజరు రిజిస్టర్‌లో నేను వేసుకున్న లీవ్‌లను దిద్దుబాటు చేశానని ఆరోపించడం సరికాదు. విధుల్లో నేను కఠినంగా వ్యవహరించడంతోనే, కొంతమంది సిబ్బంది కావాలనే నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నాపై చేస్తున్న ఆరోపణలు అవాస్తావం.

- అనీలా, ప్రిన్సిపాల్

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కమాండెంట్ జమీల్‌బాషా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ యువత అధ్యక్షుడు దివంగత రాసమల్ల అశోక్‌గౌడ్ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన స్మారకార్థం ఏర్పాటు చేసిన మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పోటీలను గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా క్రికెట్ ఆడి పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి తొలిరోజు పోటీలో పాల్గొన్న నాగారం-కర్ణమామిడి జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ పోటీల్లో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని అన్నారు. దివంగత అశోక్‌గౌడ్ పేరుతో నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, నిర్వాహకులు డీజే.శేఖర్, ఒడ్డె బాలరాజు, స్థానికులు శ్రీనివాస్‌గౌడ్, ఒడ్డె శ్రీనివాస్, రవి, బేర పోచన్న, లగిశెట్టి రాజన్న, కందుల రమేశ్, దొమ్మటి సత్తయ్య, అంకం కృష్ణమూర్తి, దొమ్మటి లచ్చన్న పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు

జైపూర్: మండలంలోని ఇందారంలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం కళావతి-వెంకటస్వామి కాక స్మారక క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, గుడేల్లి శ్రీనివాస్‌రెడ్డి, యూత్‌నాయకులు ఆసంపల్లి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలోని ఆయా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లిచాల్సి ఉంటుందని విజేతగా నిలిచే టీంకు రూ.20వేలు, రన్నరప్ టీంకు రూ.10వేలు మనీ ప్రైజ్ చెల్లించనున్నట్లు తెలిపారు.

లంబాడాల పాదయాత్ర



పాదయాత్రతో పల్లకి ఊరేగింపు నిర్వహిస్తున్న లంబాడాలు

జన్నారం: ప్రతీ సంవత్సరం జనవరి 11న నార్నూర్ మండలం కొత్తపల్లిలోని దీక్షగురు కర్మయోగి ప్రేమ సింగ్ మహారాజ్ ఆశ్రమంలో నిర్వహించే గురు మిలన్ దివాస్ కార్యక్రమానికి జన్నారం మండలానికి చెందిన లంబాడి గిరిజనులు సేవాలాల్ మహారాజ్ పల్లకితో పాదయాత్రతో బుధవారం జన్నారం నుంచి బయలుదేరారు. భక్తి శ్రద్ధలతో ప్రతీ సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివెళ్లాలని చేసుకున్న నిర్ణయం మేరకు జన్నారం మండల కేంద్రంలోని సేవలాల్ ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరినట్లు కుల పెద్దలు సందేశ్, దశరథ్, బీంలాల్‌లు తెలిపారు.

మున్నూరుకాపులు ఐక్యతతో ముందుకు సాగాలి

- సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్: మున్నూరు కాపులు ఐక్యతతో ముందుకు సాగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం పిలుపునిచ్చారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మున్నూరుకాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు శీపతి సురేష్, జిల్లా అధికార ప్రతినిధి బాస్కర్ల రాజేశంతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాపు కులస్తులు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పడాల రవీందర్, గుమ్మడి తిరుపతి, పానుగంటి సత్తయ్య, సకినాల నర్సయ్య, బొడ్డు తిరుపతి, ఆకుల లక్ష్మణ్, లాగర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రితో విద్యార్థులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచిర్యాలకు చెందిన మాధవ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు రకాల విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌తో పాటు ఒక్కో విద్యార్థికి 10రకాల వస్తువులను అందజేశారు. విద్యాసామగ్రితో పాటు విద్యార్థుల ఆరోగ్య పరీక్షల నిమిత్తం రెండు పల్స్ మీటర్లు, ఒక్క థర్మామీటర్, రెండు పీపీఈ కిట్లు అందజేశారు. రాబోవు రోజుల్లో కూడా పాఠశాల విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా మరింత సేవా కార్యక్రమాలను చేపడ్తామని విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతమైన స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదాంతం విశ్వప్రసాద్, మాధవ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రేవెల్లి బాపూజీ, సభ్యులు చందా కిరణ్, పెంట శ్రీనివాస్, మాదాసు మహేందర్, ఉపాధ్యాయులు సునిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



కోటపల్లి: పాఠశాలలో పిండి వంటకాలు తయారు చేస్తున్న ఎస్‌వో

కోటపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎస్‌వో హరిత ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ అనంతరం పిండివంటలు తయారు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ముందస్తుగా సంక్రాంతి పండగ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు కేజీబీవీ జిల్లా కో ఆర్డినేటర్ యశోధర ముఖ్యఅతిథిగా హాజరు కాగా పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనతో పాటు విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ యశోధర పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు అందించి, పాఠశాలలో విద్యార్థుల భోజన మెనూను పరిశీలించి పలు సూచనలు చేశారు.



కర్ణమామిడి కేజీబీవీలో సంక్రాంతి వేడుకలు



కోటపల్లి: కస్తూర్బా పాఠశాలలో...



కర్ణమామిడి కేజీబీవీలో పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతల పంపిణీ



లక్సెట్టిపేట: తలంబ్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు



భీమారం: నర్సింగాపూర్‌లో...



చెన్నూర్ శ్రీనగర్‌కాలనీలో...



హాజీపూర్‌లో...

చెన్నూర్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు, శ్రీరాముని ఫొటోలను మద్ది వెంకన్న ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు బెల్లంకొండ మల్లారెడ్డి, వెంకటాచారి, శంకర్, హనుమండ్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో హనుమాన్ చాలిసా పారాయణం వారి ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో భక్తులకు అందరికీ తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బొప్పు సతీష్, సత్యనారాయణ, మురళి, శారద, చంద్రయ్య పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లో హనుమాన్ ఆలయంలో బుధవారం రాములోరి అక్షింతలకు పూజలు నిర్వహించి అనంతరం గ్రామంలో పంపిణీ చేశారు. ఇందులో ఎంపీటీసీ రూప, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు బుధవారం హాజీపూర్ మండలానికి చేరగా స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలకగా చెక్కభజనల ఆటలతో ఘన స్వాగతం పలికారు. శోభాయాత్రగా ఇంటింటికీ వెళ్తూ అక్షింతలతో పాటు శ్రీరామ మందిర పటం, కరపత్రాలను అందజేశారు. హాజీపూర్ మండల సమయోజక్ బొలిశెట్టి తిరుపతి మాట్లాడుతూ.. 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ అక్షింతలు, రామ మందిర చిత్రపటం, కరపత్రాలను అందజేస్తున్నట్లు, అయోధ్యలో జనవరి 22న శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రతీ ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి అక్షింతలు అందరూ వేసుకోవాలని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో హిందూ బంధువులు, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ సేనా కమిటీ నియామకం



సమావేశమైన గిరిజనులు

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామ పంచాయతీ పాలగోరి గూడెం ఆదివాసీ సేనా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన ఆదివాసీ సేనా కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా సీడాం మోతీరాం, ఉపాధ్యక్షుడిగా కుమ్ర లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం జ్యోతిరాం, సంయుక్త కార్యదర్శిగా ఆత్రం లచ్చు, ప్రచార కార్యదర్శిగా తెలంగరావు, సభ్యులుగా రాజు, మాన్కు, మారు, ముక్తుర్‌షావ్, జంగు, సీతరాంలను నియమించినట్లు ఆదివాసీ సేనా మండల అధ్యక్షుడు యశ్వంతరావు, తుడుందెబ్బ అధ్యక్షుడు కాశీలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసుకున్న పాలగోరి గూడెం సమస్యల పరిష్కారం కోసం కమిటీ పని చేస్తుందన్నారు.

ధర్మరావ్‌పేటలో 'వికసిత్ భారత్'



ప్రచార పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

దండేపల్లి: మండలంలోని ధర్మరావ్‌పేటలో మోదీ 'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రచారయాత్రలో మోదీ సంక్షేమ పథకాలను గురించి బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి వివరించారు. కేంద్రం నిధులతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు కొల్లూరి దేవరాజు, కామెర లక్ష్మణ్, రేడియో రాములు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

జన్నారం: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం 2024క్యాలెండర్‌ను బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణరాణి ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న సేవా కార్యక్రమాలను తహసీల్దార్ కొనియాడారు. ఉద్యోగాలు విరమణ పొందిన తర్వాత కూడా యూనియన్‌గా ఏర్పడి, వృద్ధులకు, విశ్రాంత ఉద్యోగులకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూమన్న, ప్రధాన కార్యదర్శి కస్తూరి నాగేశ్వర్, కోశాధికారి బుచ్చన్న, సభ్యులు లచ్చన్న, మురళి, తారాచంద్, రాజయ్య, శారత, మునీర బేగం, తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో ఉచిత వైద్యశిబిరం



భీమారం: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రెండు రోజుల క్రితం కాలనీకి చెందిన లక్ష్మణ్ డెంగీ లక్షణాలతో మృతి చెందడంతో అధికారులు చర్యలు చేపట్టి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో మండల వైద్యాధికారి అనిల్ 80మందికి వైద్యపరీక్షలు చేశారు. పరిశుభ్రతపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ముఖ్యంగా దోమల వ్యాప్తికి కారణమైన టైర్లు, ఇతర వస్తువుల్లో నిల్వ నీటిని తొలగించాలని కోరారు. ఇందులో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.